# కట్నం పదివేలు

❋

* రచన: శ్రీ వి. కె. గణేశ్వరరావు *



(రచయిత)

నాకు చాలా సన్నిహితమైన నా స్నేహితుడి పెళ్ళికని కష్టపడి మల్లెపూలు గ్రుచ్చి దండలు తయారు చేశాను. మిగతా స్నేహితులంతా కూడా తమకు తోచిన సహాయాలు అందించారు. మా అందరి శ్రమదానమే ఆ యింటిలో పెళ్ళి అని యితరులనుకోవడానికి దోహదకారి అయినదని ఒక విధంగా చెప్పవచ్చు. ఒకసారి ఎవరూ లేని సమయంలో—''ఒరే రాజేష్!'' అని పిలిచాను.

వాడు పలక లేదు....

కొంచెం గట్టిగా ''ఒరే, కొత్త పెళ్ళికొడకా?'' అని పిలిచాను.

''ఏంట్రా!'' అని నా వైపు చూశాడు ఏదో విషయం లోంచి మునిగి తేలినట్లు.

''ఏరా, అప్పుడే నన్ను మరిచిపోయావ్...,నీ కాబోయే ఆవిడగారి గుర్తుకొచ్చిందా అప్పుడే. అవున్లే పెళ్ళి తర్వాత మాట్లాడ్తావో, మాట్లాడవో!'' అన్నాను కాస్త వ్యంగ్యంగా ఒక మల్లెపూపు గుచ్చి వెనక్కి నెడుతూ.

''ఛ....అదేం లేదు లేరా! నువ్వు నా దగ్గర లేవిదే నేవసలే పెళ్ళి కూడా చేసుకోన్రా!'' అన్నాడు నవ్వుతూ.

'ఫర్వా లేదులే' అని నా మనసులో అనుకుని వాడికి నాపైవున్న ప్రేమకు లోలోన పొంగి పోయాను. కాని బయటికి ప్రదర్శించ లేకపోయినందుకు కొంచెం బాధ పడ్డాను. ఎవరో ఒకసారి మాట్లాడుకుంటుంటే — 'కట్నం....పది....వేలు' అన్న మాటలు లీలగా నా చెవిన పడ్డాయి. కొంచెం అనుమానం వచ్చింది రాజేష్ మీద. అందులో 'ఆఁ' అనుకుంటున్న వాళ్ళు రాజేష్‌కు దగ్గరి బంధువులు కావడంవల్ల నా అనుమానం నిజమేమోనన్న అనుమానం నాలో బలపడుతోంది. ఇదే విషయాన్ని వాడి ముందుంచాను. నిజమేనని వాడు నిస్సంకోచంగా సమాధాన మిచ్చేసరికి నేను స్తబ్ధుడనయి పోయాను. వాడిలో ఏ తొట్రుపాటు లేకుండా స్వచ్ఛంగావున్న ధీమా, తీవి చూసేసరికి నా మెదడు వేడెక్కడం ప్రారంభించింది. మనసు వికలమై పోయింది. శరీరమంతా మెలికలు తిరిగి పోతున్నట్లనిపించింది. అయినా నాకు నేనే విగ్రహించుకున్నాను. రేపే పెళ్ళి....రాత్రి పన్నెండు గంటలు దాటుతోంది. వెళ్ళి పడుకున్నాను మా యింట్లో.

* * *

తెల్లవారింది ఎపుడో....నాకు తెలీనే తెలీదు! ఉదయం 11 గంటలకు నాకు మెలకువ వచ్చింది. లేచి గబగబా కాలకృత్యాలు తీర్చుకుని 'విలువ లేని ప్రమాణా లెందుకు?' పుస్తకం తీసి చదివాను. అయినా మధ్య మధ్యలో ఏవేవో ఆలోచనలు! ఆ పుస్తకంలోని మూలాంశమేమిటి అన్నది కూడా నాకర్థం కాలేదు. అసహనంగా లేచివెళ్ళి ''అమ్మా అన్నం పెట్టు!'' అన్నాను. అవును - అడగవిదే అమ్మ అయినా పెట్టదుకదా అనుకోవాలి అంటే, మా అమ్మ అటువంటిది కాదు. మధ్యాహ్నం ఒంటిగంట దాటిందంటే ప్రతి ఐదు నిముషాలకో సారి తల్చుకుందంటే నిముషానికో సారైనా ''ఒరేయ్, అన్నం తిందూ రారా....టైం దాటుతుంటే ఆకలి చచ్చిపోతుందిరా.'' అంటూ రెట్టిస్తూంటుంది. అందుకే ఈ రోజు ఆశ్చర్య పోయాను. అన్నం పెట్టింది అమ్మ. కానీ ఏం మాట్లాడలేదు. కనీసం కూర బావుందా అని కూడా అడగలేదు. పెట్టినంతవరకూ తిని—బయటికెళ్ళిన మా అమ్మని పిలిచి మారన్నం కూడా పెట్టించుకోకుండా చేయి కడుక్కుని లేచివెళ్ళి బయట జామచెట్టుకింద కుర్చీ వేసుకుని కూర్చున్నాను. ప్రక్కింటి షుంగ పిన్న

మ్మతో మాట్లాడ్తూంది మా అమ్మ. నా మనసులో ఏవో గత స్మృతులు చోటు చేసుకుంటున్నాయి. వాటిని బలవంతంగా సైనా వెళ్ళగొట్టాలని ప్రయత్నిస్తే విఫలం అయిపోయింది నా ప్రయత్నం.... !

ఒకనాడు రాజేష్ నేను ఈ క్రింది విధంగా సంభాషించుకున్నాం. ఈ సంభాషణే నా ప్రయత్నాన్ని విఫలం చేసింది. ఇదెంత గట్టి పిండం అనిపించింది (మీక్కూడా అనిపించవచ్చు).

రాజేష్ :—''వెధవలిలా అమ్ముడు పోతారెందుకురా. వాళ్ళ దగ్గర కట్నం తీసుకుని వాళ్ళనే బాధిస్తారు.'' (కాసేపు న్యూస్ తిరగేశాక).

నేను :—''మరి నువ్వు అమ్ముడు పోయే పశువ్వా. సంస్కరణ వాదం కలిగి మానవత్వ ప్రాంగణాన నగారా మోగించే మనీషివా ''

రా :—నో. నేను మనిషినే. నేను నయాపైసాకూడా తీసుకోను.

నే :—నిజంగా....నీ నిజ జీవితంలో నీ మాటల్ని ప్రతిఫలించే ధైర్యముందా ?

రా :—''చూస్తూండురా !''

ఇంతలో గత స్మృతులకు గండి పడినట్లు—''ఏరా నరేంద్రా. మీ ఫ్రెండ్ పెళ్ళికి వెళ్ళలేదేంరా ?'' అన్న మాట విన్పడింది. తల త్రిప్పి చూశాను. మా అమ్మ గ్లాసులో మజ్జిగ తీసుకుని వెనుకనుంచి వస్తుంది. దగ్గరికొచ్చి గ్లాసు చేతికిస్తూ—''ఎందు కెళ్ళలేదు ?'' మళ్ళీ అడిగింది అమ్మ.

''.... .... .... ....''

''కట్నం పది వేలట కదా ?'' మా అమ్మ.

మళ్ళీ ''....... .......'' నేను. నేనేమీ మాట్లాడక పోయేసరికి నా వేపు చూసి —''సర్లే, ముందా మజ్జిగ త్రాగు. ఒక రెండు తులాల వుంగరం - అందులో వజ్రం పొదిగి వేలికి తొడుగుతార్ట కదా !'' మళ్ళీ అడుగుతోంది మా అమ్మ. గడగడా తాగి గ్లాసు పక్కన పెట్టాను. ''————'' నేను.

''ఒక అరౌందల చేతి గడియారం కూడా పెడ్తున్నార్ట కదా !'' మా అమ్మ.

''నేను————'' నేను. మా అమ్మ వాలకాన్ని పరిశీలిస్తున్నాను. ఏం చెప్పాలో నాకేమీ అర్థం కావటం లేదు.

''ఏదో వెయ్యి రూపాయల సైకిల్ కూడంట కదా !'' మళ్ళీ మా అమ్మ. ఇలా నేనేమీ సమాధానం చెప్పకుండానే మా అమ్మ వెంట వెంటనే అడుగుతోంది. ఆ మాటల్లో కాస్త ఎత్తిపొడుపు ఎగిరి పడుతోందని గ్రహించినాను.

''మాటలంటే సరిపోదు. చేతల్లో వుండాలి దేవ. ఆ రోజు నా ఫ్రెండ్ నయాపైసా కూడా కట్నం తీసుకోడని. అసలు మా ఫ్రెండ్ 'షిప్'లో ఎవరూ వరకట్నం లగేజీని ఎక్కించరని చాలా-చాలా, గొప్ప-గొప్పగా చెప్పావ్ కదా ఇవ్వాళేమయిందిరా ?'' అంటూ గ్లాసు తీసుకుని సమాధానం నేను యివ్వలేనన్నట్లుగా నా వేపు చూడకుండా వెళ్ళి పోతోంద.

ఆశయాలు వల్లించి ఆచరణలో పెట్టలేని ఈ నీచులు, ఈ చాతకాని వెధవలు ఎవడి ఉద్ధరణ కోసం పుట్టారంట. చప్పుడు చేయక ఆత్మహత్య చేసుకోకూడదూ చాత కానప్పుడు. వీళ్ళకంటే ఎవళ్ళకు హాని చేయని ఆ నాలుక్కాళ్ళు మునిసిపాలిటోళ్ళు నయం అనిపించింది నాకు. కొద్దిగా కదిలాను - అప్పటిదాకా నా కాళ్ళమీదున్న పుస్తకం జారి క్రింద పడింది. ''విలువలేని ప్రమాణా లెందుకు ?'' అనే టైటిల్ రాజేష్‌లాంటి వాళ్ళని కాక నన్నే వెక్కిరిస్తున్నట్లనిపించింది. స్నానం చేద్దామని యింట్లో కెళ్ళాను. ''పట్టి మాటలు కట్టి పెట్టవోయ్ - గట్టి మేల్ తల పెట్టవోయ్....'' అంటూ మా తమ్ముడు గణపతి గడగడా చదివేస్తున్నాడు.

''చాల్లే నోర్మూయ్. అంత గట్టిగా ఎందుకు ? నోట్లో చదువుకో ! పైకి చదవమాకు. పక్కన అక్కయ్య చదూకుంటోంది. డిస్టర్బెన్స్ అవుతుంది. ఇది దురలవాటురా నాయనా అంటే వినిపించుకోవ్ కదా :'' అన్నాను.

''ముందు నువ్ నోర్మూసుకుని రా. ఇక్కడ బక్కెట్లో వేన్నీళ్ళు చల్లారి పోతున్నాయ్, త్వరగా వెయ్. నాన్న డ్యూటీ నుంచొస్తాడు. మళ్ళీ నీకు ఆలస్యమవుతుంది,'' అంటూ మా అమ్మ మరింత బెదిరించేసరికి టవల్ తీస్కుని బాత్‌రూంలో కెళ్తూంటే—

''ఒరే రాజేష్ ! నువ్వు తప్పు చేసింది కాక యిక్కడ నన్ను ఛీత్కారాలకు గురి చేస్తున్నావ్ కదరా రాస్కెల్ !'' ఈ మాటలు అప్రయత్నంగా నా నోరు విడిచి పెట్టింది.

మా అమ్మ గలగలా నవ్వగానే, తలొంచుకుని చెంబుడు నీళ్ళు తలపై గుమ్మరించుకున్నాను.